సాక్షి వరంగల్

శుక్రవారం । 1 । ఆగస్టు । 2025



గమ్యంపై గురితో విజయం

గమ్యంపై గురిపెడితే విజయం సొంతమవుతుందని తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ అన్నారు. - 8లో▸



వైద్యం కోసం వచ్చి.. - 8లో▸

వైద్యుడి నిర్లక్ష్యం కారణంగా రైతు మృతి చెందాడని కుటుంబీకులు జనగామలోని అజంతా హాస్పిటల్ ఎదుట ఆందోళన చేశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33^0 /25^0

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం వేళ సాధారణంగా ఉంటుంది. సాయంత్రం సమయంలో ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి



ఖిలా వరంగల్: శిక్షణతో ఉపాధ్యాయులు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సుజన్ తేజ కోరారు. ఈమేరకు కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ధరావత్ పూసారం అధ్యక్షతన గురువారం సోషల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. డిజిటల్ బోధన, నైపుణ్యాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఐఎఫ్‌బీ ప్యానల్ బోర్డును ఉపయోగించాలని, ప్రభుత్వ విద్యావ్యవస్థ బలోపేతంలో భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. సమావేశంలో స్కూల్ కాంప్లెక్స్ సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డి, సోషల్ రిసోర్స్ పర్సన్స్ సీహెచ్ సంపత్‌కుమార్, ఎం.భిక్షపతి, హేమంత్, సంపత్,సుమన్, సదాలక్ష్మి, భూపాల్‌రెడ్డి, పెరుమాండ్ల సాంబమూర్తి, రంగాచారి,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి



నర్సంపేట రూరల్: మాదన్నపేట చెరువు కింద ఉన్న ఆయకట్టు రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని ఏఈఈ నితిన్ సూచించారు. చెరువు పెద్ద కాల్వ నీటిని ప్రజాప్రతినిధులు, రైతుల సమక్షంలో గురువారం విడుదల చేశారు. కార్యక్రమంలో చెరువు నీటి సంఘం మాజీ చైర్మన్ కుమారస్వామి, చింతల సాంబరెడ్డి, పెద్ద కాల్వ రైతులు, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, లస్కర్, కుమారస్వామి, నాగరాజు, సదయ్య తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

న్యూశాయంపేట: హైదరాబాద్ బేగంపేట, రామంతాపూర్‌లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూళ్లలో ఒకటో తరగతిలో ప్రవేశానికి అర్హులైన గిరిజన విద్యార్థినీవిద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఏటూరునాగారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యాసంవత్సరానికి వరంగల్ జిల్లా గిరిజనాభివృద్ధి శాఖ ద్వారా (ముగ్గురు బాలురు, ముగ్గురు బాలికలు) ఆరుగురికి ప్రవేశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. దరఖాస్తులకు ఈనెల 8వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. వివరాల కోసం అంబేడ్కర్ భవన్ ఎదురుగా ఉన్న ప్రాజెక్టు అధికారి క్యాంపు కార్యాలయం, హనుమకొండ అశోక్‌నగర్ కాలనీలోని వరంగల్ జిల్లా గిరిజనాభివృద్ధి కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

పెద్దకొర్పోలు రామాలయంలో చోరీ



నెక్కొండ: మండలంలోని పెద్దకొర్పోలు గ్రామ సీతారామచంద్రస్వామి దేవాలయంలో గురువారం దొంగతనం జరిగింది. ఆలయ అర్చకుడు రామానుజం వెంకటేశ్వర్లు చేసిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. క్లూస్ టీం, పోలీసు జాగిలంతో ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఆలయ తాళం పగులగొట్టి చోరీ చేశారని ఎస్సై మహేందర్ తెలిపారు. వెండి శఠగోపం, వెండి గిన్నె, 24 తులాల వెండి వస్తువులు దొంగిలించుకుపోయారని ఆయన పేర్కొన్నారు.

చెన్నారావుపేటలో..

నర్సంపేట: చెన్నారావుపేటలో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన తాళ్లపల్లి నర్సయ్య మూడు రోజుల క్రితం తన ఇంటికి తాళం వేసి ఆస్పత్రిలో చూపించుకోవడానికి హైదరాబాద్ వెళ్లాడు. బుధవారం రాత్రి దుండగులు ఇంటి తాళం పగులగొట్టి లోపలికి చొరబడ్డారు. ఇంట్లో ఉన్న బీరువాలను తెరిచి రూ.25 వేల నగదు అపహరించుకుపోయారు. వస్తువులను చిందర వందరగా పడవేశారు. గురువారం ఉదయం స్థానికులు గమనించి చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. చెన్నారావుపేట ఎస్సై రాజేశ్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని సందర్శించి చోరీ జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం క్లూస్ టీం పోలీసులు వచ్చి వేలిముద్రలను సేకరించారు.

ఎల్‌ఆర్‌ఎస్.. నో క్లియరెన్స్!



ఎక్కడి దరఖాస్తులు అక్కడే.. సగం వరకు ఆన్‌లైన్‌లోనే పెండింగ్

- ఎల్–1, ఎల్–2 స్థాయి దాటని వైనం.. సాగని స్పాట్ వెరిఫికేషన్
- జీడబ్ల్యూఎంసీతోపాటు మున్సిపాలిటీల్లో ఇదే పరిస్థితి
- దరఖాస్తుదారులకు తీరని చిక్కులు.. ప్రభుత్వ ఆదేశాలు బుట్టదాఖలు

సాక్షిప్రతినిధి, వరంగల్:

- హసన్‌పర్తి మండలం దేవన్నపేట శివారులో హుజూరాబాద్‌కు చెందిన ఓ టీచర్‌కు 400 గజాల స్థలం ఉంది. ప్రభుత్వం ఇచ్చిన అవకాశం మేరకు 25 శాతం రాయితీపై మార్చి 30న రూ.60 వేల పైచిలుకు డబ్బులు ఆన్‌లైన్‌లో ఎల్‌ఆర్‌ఎస్ కింద చెల్లించారు. ఇప్పటికీ ఆయన ఫైల్ క్లియరెన్స్ కాకపోగా.. ఎల్–1 స్టేజీలోనే పెండింగ్‌లో చూపుతుండడంతో అధికారులను కలిస్తే రేపు, మాపు అంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- వరంగల్ మామునూరు శివారులోని ఓ వెంచర్‌లో నగరంలోని బట్టల దుకాణంలో పనిచేసే ఒకవ్యక్తి 220 గజాల స్థలం తీసుకున్నాడు. ప్రభుత్వం ఇచ్చిన ఎల్‌ఆర్‌ఎస్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు అప్పుచేసి ఏప్రిల్ 10న రూ.31 వేల వరకు ఆన్‌లైన్‌లో చెల్లించారు. ఇప్పటివరకు తన ఫైల్ ఎల్–1 దగ్గరే 'పెండింగ్' చూపుతోందని చెప్పారు.

... ఇలా హనుమకొండ, వరంగల్, కాజీపేట ట్రిసిటీ.. గ్రేటర్ వరంగల్ చుట్టూ నాన్ లేఅవుట్ ప్లాట్లు తీసుకుని ఎల్‌ఆర్‌ఎస్ కట్టిన పలువురు ఇబ్బంది పడుతున్నారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధితో పాటు మున్సిపాలిటీల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. ఎల్‌ఆర్‌ఎస్ చెల్లించిన రశీదులతో అధికారుల చుట్టూ తిరుగుతున్న బాధితులు.. ఉన్నతాధికారులకు ఫిర్యాదు విషయంలో వేచిచూసే ధోరణిలో ఉన్నారు.

మొదటినుంచి ఇదే కథ...

అక్రమ లే అవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు 25 శాతం మినహాయింపు ఉపయోగించుకోవాలని అనుకునే వారికి మొదటి నుంచి అవాంతరాలు తప్పడం లేదు. ప్రభుత్వం మార్చి 31 వరకు 25శాతం రాయితీ కల్పించిన నేపథ్యంలో ఫిబ్రవరి నుంచి ఎల్‌ఆర్‌ఎస్ ఫీజ్ చెల్లింపునకు ఓపెన్‌కాని వెబ్‌సైట్స్.. యాక్సెప్ట్ కాని ఆన్‌లైన్‌ల కష్టాలు వెంటాడాయి. చివరికి దరఖాస్తుదారులు మున్సిపల్ ఆఫీస్‌లు, మీ– సేవ సెంటర్ల చుట్టూ తిరిగి తిరిగి పనులు కానిచ్చారు. ఇదే సమయంలో మార్చి 31 డెడ్‌లైన్ ప్రభుత్వం వెసులుబాటు కల్పించడంతో మొత్తానికి వారం, 10 రోజుల తిరిగైనా దరఖాస్తుదారులు ఆన్‌లైన్ ద్వారా రుసుం చెల్లించారు. 25శాతం మినహాయింపు డెడ్‌లైన్‌ను ఉపయోగించుకున్న చాలామంది ఎల్‌ఆర్‌ఎస్ కోసం డబ్బులు చెల్లించగా.. ఇప్పుడు ఆ దరఖాస్తుల ఆమోదానికి కూడా నెలలు గడుస్తుండటం ఇబ్బందికరం అవుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రహసనంగా ఆన్‌లైన్ క్లియరెన్స్..

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్, ఉమ్మడి జిల్లా 9 మున్సిపాలిటీల్లో ఎల్‌ఆర్‌ఎస్ కోసం 2020లో 1,58,265 దరఖాస్తులు వచ్చాయి. ఒక్క కార్పొరేషన్ పరిధిలోనే 1,00,989 దరఖాస్తులు ఉన్నాయి. ఈ దరఖాస్తుల క్లియరెన్స్ 2020 తర్వాత పెండింగ్‌లో పడగా.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మళ్లీ ఆ దరఖాస్తుల్లో కదలిక వచ్చింది. 25శాతం రాయితీతో మొత్తం 1,43,121 దరఖాస్తులపై ఎల్‌ఆర్‌ఎస్ చెల్లించగా, గ్రేటర్ వరంగల్ లో 96 వేల మంది ఉన్నారు. ప్రధానంగా ఈ స్థలాలన్నీ హసన్‌పర్తి, ఖిలావరంగల్, కాజీపేట, హనుమకొండ, ధర్మసాగర్, గీసుకొండ, మామునూరు తదితర ప్రాంతాల పరిధిలో ఉన్నాయి. వీటన్నింటిపై ఎల్‌ఆర్‌ఎస్ రుసుము చెల్లించి ఐదారు నెలలు గడుస్తున్నా 40 శాతానికి పైగా దరఖాస్తులు ఆన్‌లైన్‌లో ఎల్–1 స్టేజ్‌లో పెండింగ్‌లో ఉన్నట్లు బాధితులు చెబుతున్నారు. ఎల్–1 అధికారి ధ్రువీకరించి ఎల్–2కు సిఫారసు చేస్తే.. ఎల్–3లో ఉన్నతాధికారులు క్లియర్ చేస్తారు. ఇందుకోసం ఎల్–1 స్థాయి అధికారిని కలిస్తే స్పాట్ వెరిఫికేషన్ రేపు, మాపు అంటూ ఐదారు నెలలుగా తిప్పుకుంటున్నారని వాపోతున్నారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడానికి, పేర్లు చెప్పడానికి జంకుతున్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్, మున్సిపాలిటీల ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ఎల్‌ఆర్‌ఎస్ చెల్లించిన వారి ఆన్‌లైన్ దరఖాస్తులను పరిష్కరించి ప్రభుత్వ ఆశయం నెరవేరేలా చూడాలని బాధితులు కోరుతున్నారు. కాగా, జీడబ్ల్యూఎంసీ అధికారులు మాత్రం ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులపై నిబంధనల ప్రకారం ప్రాసెస్ జరుగుతోందని, దశల వారీగా అన్ని క్లియర్ చేస్తామని చెబుతున్నారు.

కార్పొరేషన్/మున్సిపాలిటీల వారీగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు ఇలా..

జిల్లా	మున్సిపాలిటీ	దరఖాస్తులు
	గ్రేటర్‌వరంగల్ కార్పొరేషన్	1,00,989
హనుమకొండ	పరకాల	3,182
వరంగల్	నర్సంపేట	5,421
	వర్ధన్నపేట	522
మహబూబాబాద్	మహబూబాబాద్	12,201
	డోర్నకల్	872
	మరిపెడ	2,629
	తొర్రూరు	10,299
జేఎస్ భూపాలపల్లి	భూపాలపల్లి	3,771
జనగామ	జనగామ	18,379
మొత్తం		1,58,265

కుళ్లిన కూరగాయలతో కూరలా?

- మల్లంపల్లి కేజీబీవీ ప్రత్యేక అధికారిపై కలెక్టర్ సత్యశారద ఆగ్రహం
- వంట మనుషులను వెంటనే తొలగించాలని ఆదేశం



కుళ్లిన క్యాబేజీని ఎందుకు నిల్వ చేస్తున్నారని ప్రత్యేకాధికారిని ప్రశ్నిస్తున్న కలెక్టర్ సత్యశారద

దుగ్గొండి: కుళ్లిపోయిన కూరగాయలు.. నాణ్యత లేని మసాలాలు, అల్లం వెల్లుల్లి పేస్టుతో కూరలు వండి పెడితే బాలికల ఆరోగ్యానికి ఎవరు బాధ్యత వహిస్తారు.. నిర్లక్ష్యంగా విధులు నిర్వర్తిస్తున్నారా.. మిమ్ములను ఉద్యోగాల నుంచి ఎందుకు తొలగించకూడదు అంటూ కలెక్టర్ సత్యశారద మల్లంపల్లి కేజీబీవీ ప్రత్యేక అధికారి, ఫుడ్‌ఇన్‌చార్జ్, వంట మనుషులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కస్తూర్బా గాంధీ పాఠశాలను గురువారం ఆమె తనిఖీ చేశారు. కుళ్లిన కూరగాయలు, నాణ్యతలేని అల్లం పేస్ట్ కనిపించడంతో ప్రత్యేక అధికారి మంజులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వంట మనుషులను తొలగించాలని, కిచెన్‌ను శుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. భోజనంలో కారం, పులుపు అధికంగా వాడుతున్నారని విద్యార్థినులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కూరలో మునిగాకు ఎందుకు వేయడం లేదని ఎస్‌ఓను ప్రశ్నించారు. ఫిర్యాదుల పెట్టెను తెరిచి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

బాలికలకు కిశోర్‌రక్ష కార్డుల పంపిణీ..

ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల పాఠశాలలు, వసతి గృహాల పిల్లల ఆరోగ్యంపై కలెక్టర్ దృష్టి సారించారు. ఇందుకోసం రాష్ట్రంలోనే తొలిసారిగా నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జిల్లాలోని 75 సంక్షేమ గురుకుల పాఠశాలలు, 545 ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. మల్లంపల్లి కేజీబీవీలో విద్యార్థినులకు కిశోర్‌రక్ష కార్డులు పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. బాలికలకు వైద్యశిబిరం నిర్వహించి కార్డులపై పరీక్షల ఫలితాలను నమోదు చేయించారు. దశలవారీగా జిల్లాలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు పరీక్షలు చేయించి కిశోర్‌రక్ష కార్డులు అందిస్తామని కలెక్టర్ తెలిపారు. జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీఎంహెచ్‌ఓ సాంబశివరావు, తహసీల్దార్ రాజేశ్వర్ రావు, ఎంపీడీఓ అరుంధతి, ఎంపీఓ శ్రీధర్‌గౌడ్, వైద్యాధికారి కిరణ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి..

న్యూశాయంపేట: పథకాలు అందించడమే కాకుండా వాటిద్వారా అత్యుత్తమ ఫలితాలు సాధించే విధంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఆదేశించారు. కలెక్టరేట్‌లో పలుశాఖల అధికారులతో కలెక్టర్ గురువారం సమన్వయ సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పథకాల పర్యవేక్షణపై ఆయా ప్రాజెక్టుల అధికారులు దృష్టి సారించాలన్నారు. మహిళలు, పిల్లల సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. పలు ప్రాజెక్టుల అమలు తీరును సమీక్షించి సమర్థ నిర్వహణకు సూచనలు చేశారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీడబ్ల్యూఓ రాజమణి, డీఆర్‌డీఓ కౌసల్యాదేవి, డీఈఓ జ్ఞానేశ్వర్, డీఐఓ శ్రీధర్ సుమన్, సీడీపీఓలు మధురిమ, విద్య తదితర అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ ముగింపు కాదు

న్యూశాయంపేట: ఉద్యోగ విరమణ ముగింపు కాదని.. ఆరంభం అని కలెక్టర్ డాక్టర్ సత్యశారద అన్నారు. రిటైర్డ్ ఉద్యోగులు తమ అభిరుచులను కొనసాగించేందుకు ఇదొక మంచి అవకాశమని పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో గురువారం సాయంత్రం జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి గోవిందరాజన్, నల్లబెల్లి ఎంపీడీఓ నరసింహమూర్తి, డీఆర్‌డీఏ అకౌంటెంట్ ఆఫీసర్ పరమాత్మ ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, అధికారులు పాల్గొని వారిని పూలమాలలు, శాలువాలు, జ్ఞాపికలతో సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీఆర్‌డీఓ కౌసల్యాదేవి, జిల్లా అధికారి అనురాధ పాల్గొన్నారు.

ఎస్‌ఏలకు హెచ్‌ఎంలుగా పదోన్నతులు

ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా..

- పది రోజుల్లోనే పదోన్నతుల ప్రక్రియ పూర్తి
- మల్టీజోన్–1 పరిధిలో 490 హెడ్మాస్టర్ల ఖాళీలు..



విద్యారణ్యపురి: ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ మేరకు ప్రభుత్వ, జిల్లా పరిషత్‌లలోని స్కూల్ అసిస్టెంట్లకు హెడ్మాస్టర్లుగా (గ్రేడ్–2), ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్‌లుగా పదోన్నతుల కల్పించేందుకు గురువారం సాయంత్రం పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ షెడ్యూల్ జారీచేశారు. పదోన్నతుల కౌన్సెలింగ్ ప్రక్రియ మొత్తం 10 రోజుల వ్యవధిలో పూర్తికానుంది.

మల్టీజోన్–1పరిధిలో..

పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ (వరంగల్) పరిధిలో మల్టీజోన్–1 ఉంటుంది. ఈ జోన్‌లో మొత్తం 19 జిల్లాలున్నాయి. అందులో ఉమ్మడి వరంగల్ పరిధిలోని ఆరు జిల్లాలున్నాయి. స్కూల్ అసిస్టెంట్లు హెడ్మాస్టర్ గ్రేడ్ 2 పదోన్నతులకు సంబంధించి 490 పోస్టులు ఖాళీలున్నట్లు ప్రాథమిక సమాచారం. విద్యాశాఖ ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి ఇప్పటికే అన్ని జిల్లాలనుంచి ఖాళీలు, సీనియారిటీ జాబితాలను తెప్పించుకున్నారు. ఆయా జాబితాలను కౌన్సెలింగ్ షెడ్యూల్ ప్రకారం వెల్లడించనున్నారు.

హనుమకొండ జిల్లాలో..

హనుమకొండ జిల్లాలో 179మంది సెకండరీ గ్రేడ్ టీచర్లకు (ఎస్జీటీ)లకు స్కూల్ అసిస్టెంట్‌లుగా పదోన్నతులు లభించే అవకాశం ఉన్నట్లు ప్రాథమిక సమాచారం. జిల్లాలో 119 మంది స్కూల్ అసిస్టెంట్ పోస్టులు క్లియర్ వేకెన్సీలుండగా, 60మంది స్కూల్ అసిస్టెంట్లకు వరకు హెడ్మాస్టర్లుగా పదోన్నతులు లభించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అర్హైజింగ్ ఖాళీలు కలుపుకుని 179 మందివరకు ఎటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు లభించే అవకాశం ఉందని తెలుస్తోంది. డీఈఓ కార్యాలయంలో కొద్దిరోజులుగా పదోన్నతుల ప్రక్రియకు వేకెన్సీలు, సీనియారిటీ రూపకల్పనపై కసరత్తు కొనసాగింది.

షెడ్యూల్ ఇలా..

- 2న పీఎస్, ఉన్నత పాఠశాలల్లో గ్రేడ్–2 హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్ల ఖాళీలకు సంబంధించిన వివరాలను డీఈఓ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాలి. అలాగే.. పదోన్నతుల కోసం ఎస్‌ఏ, ఎస్జీటీల తాత్కాలిక సీనియార్టీ జాబితాను ప్రదర్శించాలి.
- 3న ఇరువురికి సంబంధించి అభ్యంతరాల స్వీకరణ ఉంటుంది.
- 4, 5వ తేదీన సీనియార్టీలపై అభ్యంతరాలను పరిష్కరించి, ఆర్జేడీ, డీఈఓ వెబ్‌సైట్‌లో ప్రదర్శించాలి.
- 6న గ్రేడ్–2 హెచ్‌ఎంల పదోన్నతి కోసం ఎస్‌ఏలకు వెబ్ ఆప్షన్ చేసుకునే అవకాశం కల్పించారు.
- 7వ తేదీన ఎస్‌ఏలకు గ్రేడ్–2 పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేస్తారు.
- 8, 9వ తేదీల్లో పదోన్నతుల ఆర్డర్ వచ్చిన గ్రేడ్–2 హెచ్‌ఎం పేర్ల ప్రదర్శన, ఎస్జీటీల సీనియారిటీ జాబితాపై అభ్యంతరాల పరిష్కారం, తుది జాబితా ప్రకటన చేస్తారు.
- 10న ఎస్జీటీ వెబ్, ఎడిట్ ఆప్షన్, 11న కలెక్టర్ ఆదేశాల అనంతరం పదోన్నతి పొందిన టీచర్లకు ఉత్తర్వుల కాపీలు అందిస్తారు.

'ముఖం' చూపించాల్సిందే..!

నేటినుంచి పాఠశాలల్లో ఎఫ్‌ఆర్‌ఎస్ అటెండెన్స్

- కొందరు ఉపాధ్యాయుల డుమ్మాలకు చెక్ పడినట్లే..
- విద్యార్థులకు ఉపయోగిస్తున్న డీఎస్‌ఈ యాప్‌నే వినియోగం
- నాలుగు రోజులపాటు రిజిస్ట్రేషన్‌కు అవకాశం
- ప్రభుత్వ స్కూల్స్, కేజీబీవీలు, మోడల్‌స్కూల్స్, యూఆర్‌ఎస్, సాధారణ గురుకులాల్లోనూ అమలు
- డీఈఓ, కలెక్టర్లు ప్రతీరోజు పర్యవేక్షణ..



విద్యారణ్యపురి: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు ఇక ముఖ గుర్తింపు (ఫేషియల్ రికగ్నిషన్ సిస్టం (ఎఫ్‌ఆర్‌ఎస్)) హాజరు అమలు చేయాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీఈఓలు ఆయా ఎంఈఓలు, హెచ్‌ఎంలను గురువారం ఆదేశించారు. గత ఏడాది ఫిబ్రవరినుంచి రాష్ట్రంలోని పెద్దపల్లి జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా టీచర్ల ముఖగుర్తింపు హాజరును అమలు చేస్తున్నారు. అక్కడ విజయవంతం కావడంతో నేటి(శుక్రవారం)నుంచి రాష్ట్రవ్యాప్తంగా, హనుమకొండ, వరంగల్ జిల్లాల్లోని అన్ని ప్రభుత్వ, జిల్లా పరిషత్, కేజీబీవీలు, మోడల్ స్కూల్స్, యూఆర్‌ఎస్, టీజీఆర్‌ఈఐఎస్‌లలో అమలు చేయనున్నారు.

డీఎస్‌ఈ ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్ ద్వారా..

ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికే విద్యార్థులకు ముఖ గుర్తింపు హాజరు తీసుకుంటున్నారు. అందుకు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ (డీఎస్‌ఈ ఎఫ్‌ఆర్‌ఎస్) యాప్‌ను వినియోగిస్తున్నారు. ఇదే యాప్ ద్వారా హెచ్‌ఎంలు, టీచర్ల, నాన్ టీచింగ్ ఉద్యోగుల ముఖ గుర్తింపు హాజరు అమలుచేయనున్నారు. హెచ్‌ఎంలు తమ సెల్‌ఫోన్‌లోని డీఎస్‌ఈ యాప్‌లో టీచర్ మాడ్యూల్ టీచర్లకు, నాన్ టీచింగ్ మాడ్యూల్‌లో నాన్‌టీచింగ్ సిబ్బందికి రిజిస్ట్రేషన్ చేయాలి. ఫొటో తీసి వారి వివరాలు, పాఠశాల సమయం తదితర వివరాలు అప్‌లోడ్ చేయాలి. రిజిస్ట్రేషన్ పూర్తయ్యాక టీచర్లు, నాన్‌టీచింగ్ సిబ్బంది తమ తమ సెల్‌ఫోన్లలో సంబంధిత యాప్‌లో ఇక ఎఫ్‌ఆర్‌ఎస్ అటెండెన్స్ తీసుకోవచ్చు. నేటినుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. జియోట్యాగింగ్‌ను కూడా ఇస్తారు. పాఠశాలలోనే ముఖ గుర్తింపు హాజరు తీసుకోవాల్సి. ఒకవేళ సెలవు పెడితే తప్పనిసరిగా యాప్‌లో రిక్వెస్ట్ పెట్టుకోవాల్సి ఉంటుంది. దీనిపై విద్యాశాఖ ఉన్నతాధికారులు డీఈఓలకు డెమో ఇచ్చినట్లు సమాచారం. విద్యార్థులకు ఇప్పటికే ముఖగుర్తింపు హాజరు తీసుకుంటున్నప్పటికీ కొన్నిపాఠశాలల్లో అమలుచేయటంలేదు. ఇందుకు పలు కారణాలు చూపుతున్నారు.

వరంగల్ జిల్లాలో..

ప్రభుత్వ పీఎస్, యూపీఎస్, జెడ్పీ హైస్కూళ్లు	513
అన్ని కేటగిరీల టీచర్లు	2,767
కేజీబీవీలు	10
టీచింగ్, నాన్‌టీచింగ్	147
టీజీ మోడల్ స్కూళ్లు	06
టీచర్లు	133
యూఆర్‌ఎస్	01
టీచర్లు	06
టీజీఆర్‌ఈఐ	01
టీచర్లు	25

డుమ్మాకు చెక్‌పడినట్లేనా..?

విధులకు డుమ్మా కొట్టే కొందరు టీచర్లకు ముఖగుర్తింపు హాజరుతో చెక్‌పడే అవకాశం ఉందని భావిస్తున్నారు. జిల్లా కేంద్రాలనుంచి గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే టీచర్లు కొందరు సక్రమంగా విధులు నిర్వర్తించడంలేదనే ఆరోపణలున్నాయి. ఆలస్యంగా వెళ్లడం, సాయంత్రం నిర్దేశించిన సమయం కంటే ముందే వెళ్లిపోవడంలాంటివి జరుగుతున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రం నుంచి ఇతర జిల్లాలకు రైలు, బస్సుల ద్వారా, గ్రామీణ ప్రాంతాలకు షటిల్ సర్వీస్ చేసే టీచర్లు ఉన్నారు. ఈ ఎఫ్‌ఆర్‌ఎస్ అటెండెన్స్‌తో వారికి ఇబ్బందులు తప్పవని భావిస్తున్నారు. డీఈఓల తోపాటు హైదరాబాద్‌లోని రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు ఈ అటెండెన్స్‌పై ప్రతీరోజు పర్యవేక్షిస్తారు.

ప్రభుత్వ పాఠశాలల వేళలు ఇలా

పీఎస్‌లు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, యూపీఎస్‌లు, హైస్కూళ్లు ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటలవరకు పనివేళలున్నాయి. టీచర్లు ఉదయం నిర్దేశించిన సమయం కంటే ముందుగానే, సాయంత్రం విధుల సమయం ముగిశాక అంటే రోజుకు రెండుసార్లు ముఖ గుర్తింపు హాజరు తీసుకోవాల్సింటుంది.

ఇప్పటికే కలెక్టర్ ప్రతీరోజు సమీక్ష..

హనుమకొండ జిల్లాలో ఇప్పటికే విద్యార్థులకు తీసుకుంటున్న ఎఫ్‌ఆర్‌ఎస్ అటెండెన్స్‌ను కలెక్టర్ స్నేహ శబరీష్ ప్రతీరోజు సమీక్షిస్తున్నారు. హాజరు తక్కువగా ఉన్న పలు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నారు. ఇప్పుడు టీచర్ల ఎఫ్‌ఆర్‌ఎస్ అటెండెన్స్‌ను సైతం కలెక్టర్ ఏరోజుకారోజు పర్యవేక్షించే అవకాశం ఉంది. మరోవైపు డీఈఓ కార్యాలయాల్లో డ్యాష్‌బోర్డులు ఏర్పాటు చేస్తారు. డీఈఓలు కూడా టీచర్ల అటెండెన్స్‌ను పర్యవేక్షిస్తారు.

ఖాతాదారులు బీమా కలిగి ఉండాలి

- రిజర్వ్ బ్యాంకు జనరల్ మేనేజర్ ముత్యాల జ్ఞానసుప్రభాత్



బీమా చెక్కు అందజేస్తున్న రిజర్వ్ బ్యాంకు జనరల్ మేనేజర్ ముత్యాల జ్ఞానసుప్రభాత్

సంగెం: బ్యాంకు ఖాతాదారులు విధిగా బీమా కలిగి ఉండాలని రిజర్వ్ బ్యాంకు జనరల్ మేనేజర్ ముత్యాల జ్ఞానసుప్రభాత్ సూచించారు. చింతలపల్లిలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో గురువారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచుకోవాలన్నారు. బీమా చేయించుకుంటే కుటుంబాలకు భరోసా ఉంటుందన్నారు. ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన కలిగి ఉండి కుంటపల్లి గ్రామానికి చెందిన జున్న రమేశ్ ఇటీవల అనారోగ్యంతో మరణించగా.. నామిని అయిన అతడి భార్య సరితకు రూ.2 లక్షల చెక్కు అందజేశారు. రిజర్వ్ బ్యాంకు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ తాన్య సంగ్మా, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ రాజు, డీఎంఎఫ్ఐసీ శ్రీనివాస్, టీజీబీ మేనేజర్ వెంకయ్య, యూబీఐ మేనేజర్ చందు, ఎఫ్ఎల్‌సీసీ టి.భాస్కరాచారి, ఎల్‌డీఎం ఆఫీసర్ రవి, సీసీ బొజ్జ సురేశ్, వీఓఏలు మంజుల, ప్రవీణ లత, మాజీ ఉప సర్పంచ్ బండి రాధిక పాల్గొన్నారు.

మీనాక్షి నటరాజన్ పర్యటన వాయిదా

వర్ధన్నపేట: జిల్లాలో ఈనెల ఐదో తేదీన తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ పర్యటన వాయిదా పడిందని పార్టీ నేతలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 31 నుంచి వచ్చేనెల నాలుగో తేదీ వరకు రాష్ట్రంలో ఆమె పర్యటన యథావిధిగా ఉంటుందని తెలిపారు. ఆగస్టు 5, 6, 7న బీసీల రిజర్వేషన్ బిల్లు ఆమోదానికి ఢిల్లీలో కార్యాచరణ, 6న జంతర్ మంత ర్ వద్ద ధర్నాలో పాల్గొంటున్నందున జిల్లా ప ర్యటన వాయిదా పడినట్లు వారు పేర్కొన్నారు.

ధర్మారంలో వివాహిత కిడ్నాప్

గీసుకొండ: మండలంలోని ధర్మారం బస్టాండ్ వద్ద గురువారం రాత్రి వివాహిత కిడ్నాప్ అయ్యింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన రింకుమల్లి.. గౌరి పెంద్రా, ప్రియాంక, ప్రియతో కలిసి ధర్మారంలో నివాసం ఉంటోంది. వీరు శాయంపేట గ్రామంలోని కిటెక్స్ కంపెనీలో పనిచేస్తున్నారు. గురువారం విధుల్లోకి వెళ్లి తిరిగి కంపెనీ బస్సు దిగి ధర్మారం బస్టాండ్ వద్ద నడుచుకుంటూ వస్తున్నారు. వరంగల్ నుంచి నర్సంపేట వైపు కారులో వెళ్తున్న నలుగురు వ్యక్తులు వచ్చి రింకుమల్లిని కిడ్నాప్ చేసి, కారులో నర్సంపేట వైపు పారిపోయారు. స్థానిక సీఐ మహేందర్, ఎస్సై రాజు సంఘటనా స్థలానికి చేరుకొని సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. గౌరి పెంద్రా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేందర్ తెలిపారు. రింకుమల్లిని భర్త, సోదరులు కలిసి కిడ్నాప్ చేసినట్లు తెలిసింది.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న సునీత

హన్మకొండ కల్చరల్ : భద్రకాళి ఆలయ నూతన కార్యనిర్వహణాధికారిగా వరంగల్ జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఈఓగా పనిచేసిన శేషుభారతి పదవీ విరమణ చేశారు. బాధ్యతలు చేపట్టిన సునీత గతంలోను రెండు పర్యాయాలు ఈఓగా పనిచేశారు.

క్లుప్తంగా

వరంగల్ అబ్బాయి.. అమెరికా అమ్మాయి

● ఖండాంతరాలు దాటిన ప్రేమపెళ్లి



పెళ్లిలో దండలు మార్చుకుంటున్న దంపతులు

రామన్నపేట : వరంగల్ అబ్బాయి, అమెరికా అమ్మాయి ప్రేమ వివాహం గురువారం నగరంలోని వెంకటేశ్వర గార్డెన్‌లో ఇరుకుటుంబాల సమక్షంలో వైభవంగా జరిగింది. వరంగల్‌లోని పోచమ్మమైదాన్‌కు చెందిన డాక్టర్ అశోక్, సునీత దంపతుల కుమారుడు రితేశ్, అమెరికాలోని పీట్స్‌బర్గ్‌కు చెందిన జూలియాన్ మనస్సులు కలవడంతో పెద్దలను ఒప్పించి బంధుమిత్రులు, కుటుంబ సభ్యుల సమక్షంలో వివాహం చేసుకున్నారు. కాగా, అమెరికా అమ్మాయి అయినా అచ్చ తెలుగు సంప్రదాయ పద్ధతిలో వివాహం జరగడంపై అతిథులు ఆనందం వ్యక్తం చేశారు.

డీఈఓకు సన్మానం



డీఈఓను సన్మానిస్తున్న విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితారాణా, సీఎం సలహాదారు కేశవరావు

విద్యారణ్యపురి : న్యాస్ (పరాక్)లో హనుమకొండ జిల్లాను ఉత్తమస్థానంలో నిలిపినందున జూలై 30వ తేదీన హైదరాబాద్‌లో ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలో నిర్వహించిన జిల్లాల విద్యాశాఖాధికారుల సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారురు కె.కేశవరావు, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగి తారాణా.. డీఈఓ వాసంతిని సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ రమేశ్ పాల్గొన్నారు.

కేయూ ఇన్‌చార్జ్ ఫైనాన్స్ ఆఫీసర్‌గా హబీబుద్దీన్

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ ఫైనాన్స్ ఆఫీసర్‌గా డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ మహ్మద్ హబీబుద్దీన్ నియమితులయ్యారు. ఈమేరకు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.రామచంద్రం గురువారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. ఫైనాన్స్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వర్తించిన తోట రాజయ్య ఇటీవల ఉద్యోగ విరమణ పొందారు. దీంతో ఇన్‌చార్జ్ ఫైనాన్స్ ఆఫీసర్‌గా హబీబుద్దీన్‌కు బాధ్యతలు అప్పగించారు. హబీబుద్దీన్ కేయూలో 1988లో చిరు ఉద్యోగిగా చేరి అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఉద్యోగం చేసుకుంటూనే సోషియాలజీలో డాక్టరేట్ పొందారు. నేడు (శుక్రవారం) రిజిస్ట్రార్ హబీబుద్దీన్ బాధ్యతలు స్వీకరించనున్నారు.

జిల్లాలో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

కాజీపేట రూరల్: జిల్లాలో హెల్త్ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేయాలని జిల్లాకు చెందిన కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు ఢిల్లీలో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎంపీ డాక్టర్ కడియం కావ్య, బలరాం నాయక్‌ను గురువారం కలిసి వినతి పత్రాలు అందజేశారు. గతేడాది కేంద్రం తెలుగు రాష్ట్రాల్లో తిరుపతి, వరంగల్‌కు రెండు వెల్‌నెస్ సెంటర్లు మంజూరైనట్లు తెలిపారు. ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ దృష్టికి తీసుకెళ్లి సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తానని కిషన్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నేత సదానందం తెలిపారు.

గమ్యంపై గురిపెడితే విజయం..

● విధుల్లో తెలంగాణ పోలీస్ దేశంలోనే బెస్ట్
● వృత్తిలో నైపుణ్యం సాధించేందుకు డ్యూటీ మీట్ దోహదం
● 69 ఆలిండియా డ్యూటీ మీట్‌లో సత్తా చాటాలి
● తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్
● అట్టహాసంగా పోలీస్ డ్యూటీ మీట్-25 ప్రారంభం



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్



జెండాను ఆవిష్కరిస్తున్న అభిలాష్ బిస్త్



మాట్లాడుతున్న తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ ,అడిషనల్ డీజీ మహేశ్ భగవత్, సీపీ సన్ ప్రీత్‌సింగ్



డాగ్ నుంచి షేక్‌హ్యాండ్ తీసుకుంటున్న తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్

మామునూరు: ఏకాగ్రతతో గమ్యంపై గురిపెడితే విజయం సొంతమవుతుందని తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ అన్నారు. పోలీస్ అధికారులు తమ వృత్తిలో నైపుణ్యం సాధించేందుకు డ్యూటీ మీట్‌లు ఎంతో దోహదపడుతాయని పేర్కొన్నారు. విధుల నిర్వహణలో తెలంగాణ పోలీస్ దేశంలోనే బెస్ట్ అని కొనియాడారు. వరంగల్ మామునూరు పోలీస్ శిక్షణ కళాశాల పరేడ్ గ్రౌండ్‌లో వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో రెండో తెలంగాణ పోలీస్ డ్యూటీ మీట్-2025 గురువారం అట్టహాసంగా ప్రారంభమైంది. తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్, అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ ముఖ్య అతిథులుగా హాజరై డ్యూటీ మీట్‌ను ప్రారంభించారు. రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాలకు చెందిన 450 మంది పైగా 18 టీమ్‌లు హాజరుకాగా.. పోలీసులు జెండాలు చేతబూని అతిథులకు గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ మాట్లాడుతూ నేర దర్యాప్తుతోపాటు అన్ని విభాగాల్లో దేశంలోనే తెలంగాణ మొదటి రెండు స్థానాల్లో నిలవడం హర్షణీయమన్నారు. 69వ ఆలిండియా డ్యూటీ మీట్‌లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం అభినందనీయం..

ఇటీవల జరిగిన 68వ జాతీయ స్థాయి డ్యూటీ మీట్‌లో తెలంగాణ పోలీసులు 18 పతకాలు సాధించడం అభినందనీయమని అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ అన్నారు. జాతీయ స్థాయిలో సాధించిన విజయాలను దృష్టిలో ఉంచుకుని మరిన్ని పతకాలు సాధించేందుకు కృషి చేయాలని తెలిపారు. అంతకు ముందు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్.. తెలంగాణ పోలీస్ డ్యూటీ మీట్ నిర్వహణను వివరించారు.

450 మందికిపైగా పోలీస్ అధికారులు, సిబ్బంది హాజరు..

వరంగల్ మామునూరు పీటీసీలో గురువారం నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు జరగనున్న పోలీస్ డ్యూటీ మీట్-2025 అట్టహాసంగా ప్రారంభమైంది. రాష్ట్రంలోని ఏడు జోన్లతోపాటు సైబరాబాద్, రాచకొండ, హైదరాబాద్ కమిషనరేట్లు, సీఐడీ, ఇంటెలిజెన్స్, యాంటీ నార్కొటిక్ బ్యూరో, సైబర్ సెక్యూరిటీ వింగ్, జీ.ఆర్.పీ, ఐటీ అండ్ టీ, ఆక్టోపస్, గ్రేహౌండ్స్ విభాగాలకు చెందిన సుమారు 450 మందికిపైగా పోలీస్ అధికారులు, సిబ్బంది హాజరయ్యారు. సైంటిఫిక్ ఎయిడ్ ఇన్వెస్టిగేషన్, యాంటీ సబటేజ్ చెక్, కంప్యూటర్ అవేర్‌నెస్, డాగ్ స్క్వాడ్ కాంపిటీషన్, ప్రొఫెషనల్ ఫొటోగ్రఫీ, వీడియో గ్రఫీలకు సంబంధించి 25 విభాగాల్లో పోటీలు ప్రారంభమయ్యాయి. సీఐడీ డీఐజీ నారాయణ నాయక్, ఎస్పీ రాంరెడ్డి, డీసీపీలు అంకిత్‌కుమార్, సలీమా, రాజమహేంద్రనాయక్, పీటీసీ ప్రిన్సిపాల్ ఇ.పూజ, కమాండెంట్లు రాంప్రకాశ్, రామకృష్ణ, అడిషనల్ డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మల్లన్నను దర్శించుకున్న పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్



మల్లన్నను దర్శించుకుంటున్న అభిలాష్ బిస్త్

ఐనవోలు: ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి వారిని తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ దర్శించుకున్నారు. గురువారం తెలంగాణ పోలీస్ డ్యూటీ మీట్-2025 సందర్భంగా మామునూరు పీటీసీకి వచ్చిన ఆమె ఐనవోలు మల్లన్నను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అభిషేకంతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ విశిష్టతను అర్చకుడు నరేశ్ శర్మ వివరించారు. వేదపండితులు వేదాశీర్వచనం చేయగా స్వామి వారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రంతో అర్చకులు సన్మానించినట్లు ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు. కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్ ప్రకాశ్, మామునూరు ఏసీపీ ఎన్. వెంకటేష్, పర్వతగిరి ఇన్‌స్పెక్టర్ బి. రాజగోపాల్, ఎస్‌హెచ్ఓ శ్రీనివాస్, ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకుడు మధుకర్ శర్మ, వేదపారాయణ దారులు గట్టు పురుషోత్తమ శర్మ, విక్రాంత్ వినాయక్ జోషి, నరేశ్, మధు, శ్రీనివాస్, దేవేందర్ పాల్గొన్నారు.

ప్రజా మరుగుదొడ్ల నిర్వహణ చేపట్టాలి

● బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్



నయీంనగర్: పరిశీలిస్తున్న కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

రామన్నపేట : నగరంలోని ప్రజా మరుగుదొడ్ల నిర్వహణ పక్కగా చేపట్టాలని కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ సూచించారు. గురువారం హనుమకొండ ఏషియన్ షాపింగ్ మాల్ ప్రాంతంలోని డబుల్ బెడ్రూంలను, 35వ డివిజన్ వరంగల్ పుప్పాలగుట్ట వాటర్ ట్యాంక్ వద్ద శానిటేషన్ అండర్ డక్ట్ ప్రాంతం, చింతల్ బ్రిడ్జి వద్ద గల ప్రజా మరుగుదొడ్లను కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలులో భాగంగా మరుగుదొడ్ల నిర్వహణ సమర్థవంతంగా చేపట్టేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పుప్పాల గుట్ట ప్రాంతంలో పర్యటించి సిబ్బంది ఫేస్ అటెండెన్స్‌ను పరిశీలించారు. పారిశుద్ధ్య సిబ్బందితో ఆమె మాట్లాడుతూ.. విధులు నిర్వహించే తీరుతోపాటు ఒక్కపూట భోజనం సరిపోతుందా..? రెండు పూటల అందించాలా..? అని అడిగి తెలుసుకున్నారు. శివనగర్‌లో అసంపూర్తిగా ఉన్న డక్ట్‌ను పరిశీలించిన కమిషనర్ వేగవంతంగా పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సీఎంహెచ్ఓ రాజారెడ్డి, ఎంహెచ్ఓ రాజేశ్, హెచ్ఓ లక్ష్మారెడ్డి, డీఈలు రాజ్‌కుమార్, రంగరావు పాల్గొన్నారు.

పరిశీలన..

నయీంనగర్: గ్రేటర్ పరిధిలోని ఉనికిచర్ల కుడా లేఔట్ స్థలం, స్పోర్ట్స్ స్టేడియం నిర్మాణ ప్రతిపాదిత స్థలాన్ని గురువారం కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) వైస్ చైర్‌పర్సన్ చాహత్ బాజ్‌పాయ్.. అధికారులతో కలిసి పరిశీలించారు. ఆమె వెంట పీఓ అజిత్‌రెడ్డి, ఈఈ భీంరావు, ఏపీఓ రామ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యం కోసం వచ్చి అనంతలోకాలకు..

● ఆస్పత్రిలో రైతు మృతి
● డాక్టర్ నిర్లక్ష్యమే కారణమంటూ బాధితుల ఆందోళన
● జనగామ జిల్లా కేంద్రంలో ఘటన



ఆస్పత్రి ఎదుట బాధితులతో మాట్లాడుతున్న పోలీసులు

జనగామ: వ్యవసాయ పొలంలో జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ రైతు వైద్యం కోసం వచ్చి ఆస్పత్రిలో మృతిచెందాడు. ఈ ఘటనకు వైద్యుడి నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ మృతుడి కుటుంబీకులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. గురువారం జనగామ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఈ ఘటన చోటు చేసుకుంది. బాధిత కుటుంబీకుల కథనం ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం బసంతాపురం గ్రామానికి చెందిన రైతు ఎం.ప్రభాకర్‌రెడ్డి (47) గత నెల 26వ తేదీన వ్యవసాయ పొలం దున్నుతున్నాడు. ఈ క్రమంలో విద్యుత్ తీగ తెగిపడడంతో ట్రాక్టర్ అదుపు తప్పి కింద పడ్డాడు. ఈ ఘటనలో ట్రాక్టర్ కేజీవీల్స్ అతడి రెండు కాళ్లపై వెళ్లడంతో వెంటనే జనగామలోని 'అజంతా' ఆస్పత్రికి తీసుకొచ్చారు. డాక్టర్ బాలాజీ పరీక్షించి.. ప్రభాకర్ రెడ్డి కాలుకు ఇన్‌ఫెక్షన్ ఉందని, తగ్గే వరకు సర్జరీ వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. అనంతరం బుధవారం ఇంటికి తీసుకెళ్లాలని చెప్పగా పరిస్థితి విషమంగా ఉంటే ఎలా తీసుకెళ్లాలని కుటుంబీకులు సదరు వైద్యుడిని నిలదీయగా ఆస్పత్రిలోనే ఉండమన్నాడు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున ప్రభాకర్‌రెడ్డి మృతిచెందాడు. దీంతో డాక్టర్ నిర్లక్ష్యంతోనే ప్రభాకర్‌రెడ్డి మృతి చెందాడని ఆరోపిస్తూ కుటుంబీకులు ఆందోళన చేపట్టారు. కాలు ఇన్‌ఫెక్షన్‌కు గురైతే మరో ఆస్పత్రికి రెఫర్ చేయకుండా, ఐదు రోజులుగా ఆ ఆస్పత్రిలోనే ఉంచుకోవడంతోనే పరిస్థితి విషమించి ప్రభాకర్ రెడ్డి మృతి చెందాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కాగా, ఈ ఘటనపై డాక్టర్ బాలాజీ మాట్లాడుతూ పేషెంట్‌కు షుగర్, వీడీఆర్ఎల్ పాజిటివ్, ఇన్‌ఫెక్షన్, మోకాళ్ల వాపులు ఉండడంతో తగ్గే వరకు సర్జరీని వాయిదా వేసినట్లు చెప్పారు. అంతలోనే గుండెపోటుతో మృతి చెందాడని, ఇందులో తమ తప్పులేదని తెలిపారు.

నిద్రిస్తున్న ఆరేళ్ల బాలుడి మెడపై కత్తితో దాడి

● మెడభాగంలో కోసిన గుర్తుతెలియని వ్యక్తులు
● తీవ్రరక్తస్రావం అవుతుండటంతో ఆస్పత్రికి తరలింపు
● మహబూబాబాద్ జిల్లాలో ఘటన



కత్తి దాడిలో తీవ్రంగా గాయపడిన మనీష్



ఆస్పత్రిలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

కేసముద్రం: ఇంట్లో కుటుంబ సభ్యులతో కలిసి నిద్రిస్తున్న ఓ ఆరేళ్ల బాలుడి మెడపై గుర్తుతెలియని వ్యక్తులు కత్తితో కోశారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం గ్రామంలో గురువారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఉపేందర్, శిరీష దంపతులకు మనీష్, మోక్షిత్ ఇద్దరు కుమారులున్నారు. ఉపేందర్ తన తల్లిదండ్రులైన ఎల్లయ్య, మంగమ్మతో కలిసి ఒకే ఇంట్లో ఉంటున్నారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఇంట్లో కుటుంబ సభ్యులు నిద్రిస్తుండగా, నానమ్మ (మంగమ్మ) పక్కన పడుకున్న మనీష్ అనే ఆరేళ్ల బాలుడి మెడకు ఒకవైపు, వీపుభాగంలో గురువారం తెలవారుజామున 3 గంటల ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు కత్తితో కోశారు. దీంతో ఆ బాలుడు ఏడుస్తుండగా నిద్రలేచిన మంగమ్మ తన మనుమడిని దగ్గరకు తీసుకుని చూసింది. మనీష్ మెడభాగంపై గాయమై తీవ్రంగా రక్తస్రావం అవుతుండటంతో కేకలు పెట్టింది. దీంతో కుటుంబ సభ్యులతోపాటు, చుట్టుపక్కలున్న వారు నిద్రలేచి మనీష్‌ను స్థానిక ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. అక్కడినుంచి మానుకోట జనరల్ ఆస్పత్రికి తరలించారు. బాలుడి మెడపై కత్తిగాటుతో పొడవుగా పడటంతో 8 కుట్లు పడ్డాయి. కాగా, ఇంటికి రెండు దర్వాజలు ఉండగా, ఒక దర్వాజ తలుపులకు బేడం లేదని, దీంతో ఇంట్లోకి ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి ఉంటారని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. సంఘటన స్థలానికి ట్రైనీ ఎస్సై నరేష్ సిబ్బందితో చేరుకుని విచారణ చేపట్టారు. రూరల్ సీఐ సర్వయ్య మానుకోట జనరల్ ఆస్పత్రికి చేరుకుని విచారణ చేశారు. జరిగిన ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా ఉపేందర్, శిరీష దంపతుల చిన్నకుమారుడైన నిహన్ (యేడాదిన్నర బాలుడు) 7 నెలల క్రితం నీటిసంపులో పడి మృతిచెందాడు. కాగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు మనీష్‌ను మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ పరామర్శించారు. దాడికి పాల్పడిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులకు సూచించారు.

రూ. 5లక్షల విలువైన గంజాయి పట్టివేత


● ఒకరి అరెస్ట్, రిమాండ్.. మరొకరి పరారీ
● వివరాలు వెల్లడించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ అబ్బయ్య

తరిగొప్పుల: జనగామ జిల్లా తరిగొప్పుల మండలం అక్కరాజుపల్లి క్రాస్ వద్ద రూ. 5లక్షల విలువైన 10కిలోల గంజాయిని పట్టుకున్నట్లు సీఐ అబ్బయ్య తెలిపారు. ఈ మేరకు గురువారం తరిగొప్పుల పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఎస్సై శ్రీదేవి సిబ్బందితో కలిసి అక్కరాజుపల్లి క్రాస్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఒడిశాలోని గంజాం జిల్లా సూర్య నాగ గౌరీ శంకర్ రోడ్డుకు చెందిన సంతోష్ పాండా, పున్నాత్ గ్రామానికి చెందిన శివరాం డాక్వా ఆటోలో అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో ఆటోను ఆపి తనిఖీ చేయగా రూ.5 లక్షల విలువైన 10 కిలోల గంజాయి లభించింది. కాగా, శివరాం డాక్వా పోలీసులను చూసి పారిపోగా సంతోష్ పాండాను అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు చేసినట్లు సీఐ అబ్బయ్య తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్సై కాసర్ల రాజయ్య,సిబ్బంది పాల్గొన్నారు.

డబ్బుల వసూళ్లకు పాల్పడిన వ్యక్తి అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న సీఐ మల్లేశ్

చిట్యాల: మావోయిస్టు ముసుగులో డబ్బుల వసూళ్లకు పాల్పడిన వ్యక్తిని గురువారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ మల్లేశ్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం రంగయ్యపల్లికి చెందిన పల్లెపాటి గోపాల్‌రావు మద్యం, పేకాటకు బానిసయ్యాడు. అడ్డదారిలో డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో మావోయిస్టు పేరుతో ఓ లేఖను సృష్టించాడు. అనంతరం పది రోజుల క్రితం చిట్యాల మండలం శాంతినగర్ శివారులోని శ్రీ లక్ష్మీనర్సింహ రైస్ మిల్లు యజమాని శేఖరయ్యకు ఫోన్ చేసి మీతో మాట్లాడాలని చెప్పి మావోయిస్టు పార్టీ ఇచ్చినట్లు ఓ కవర్ అందించాడు. అందులో పార్టీ కోసం రూ.25 లక్షలు చందా రూపకంగా ఇవ్వాలని ఉంది. అలాగే, ప్రస్తుతం రూ. లక్ష ఇవ్వాలని, లేనిపక్షంలో చంపేస్తానని బెదించాడు. వారం రోజుల్లో రూ.25 వేలు ఇవ్వాలని, లేకపోతే చంపుతానని హెచ్చరించాడు. దీంతో రైస్‌మిల్లు యజమాని శేఖరయ్య బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి అప్రమత్తయ్యారు. ఈ క్రమంలో గురువారం డబ్బులు తీసుకోవడానికి వస్తున్న గోపాల్‌రావును కైలాపూర్ క్రాస్ వద్ద పోలీసులు ఆపి విచారించగా నిజం ఒప్పుకున్నాడు. దీంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. మావోయిస్టుల పేరుతో ఎవరైనా చందాల వసూళ్లకు పాల్పడితే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై శ్రావణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నిధుల వినియోగంపై విచారణ చేపట్టాలి

● సీఐడీకి తెలంగాణ క్రికెట్ సంఘం ఫిర్యాదు



సీఐడీ కార్యాలయం వద్ద టీసీఏ బాధ్యులు


వరంగల్ స్పోర్ట్స్ : బీసీసీఐ నుంచి హెచ్‌సీఏ ద్వారా ఆయా జిల్లాలకు విడుదలయ్యే నిధుల వినియోగంపై విచారణ చేపట్టాలని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ వరంగల్ జిల్లా కార్యదర్శి తాళ్లపెల్లి జయపాల్ గురువారం సైబరాబాద్‌లోని సీఐడీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. పది సంవత్సరాలుగా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ పేరుతో రాష్ట్రంలోని జిల్లా సంఘాల ఖాతాల్లో రూ. 12 కోట్లు జమ చేశారని పేర్కొన్నారు. అందులో ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, కరీంనగర్, నల్లగొండ జిల్లాల క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శులు నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి విచారణ చేపట్టాలని సీఐడీ అధికారులను కోరారు.

హత్యాయత్నం కేసులో వ్యక్తికి ఐదేళ్ల జైలు, జరిమానా

దంతాలపల్లి: హత్యాయత్నం కేసులో నేరస్తుడికి ఐదేళ్ల జైలు, రూ.10వేల జరిమానా విధిస్తూ మహబూబాబాద్ జిల్లా కోర్టు గురువారం తీర్పువెలువరించింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కుమ్మరికుంట్ల గ్రామానికి చెందిన ఏరుకొండ నరేశ్ అదే గ్రామానికి చెందిన పోలోజు సునీతపై 2023 సంవత్సరంలో కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై సునీత కుమారుడు యాకాంబ్రం ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై జగదీశ్ కేసు నమోదు చేసి మహబూబాబాద్ జిల్లా కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. వాదోపవాదల అనంతరం నేరం రుజువు కావడంతో నేరస్తుడు నరేశ్‌కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 10వేలు జరిమానా విధిస్తూ జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి, అసిస్టెంట్ సెషన్స్ జడ్జి షాలిని షాకెల్లి తీర్పు వెలువరించినట్లు పోలీసులు తెలిపారు. కాగా, నేరస్తుడికి శిక్ష పడేలా కృషి చేసిన పీపీ గణేశ్ ఆనంద్, ఎస్సై జగదీశ్, ఎస్సై రాజు, కోర్టు కానిస్టేబుల్ మంగీలాల్‌ను ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ అభినందించారు.

'కాసం' ప్రజాపోరాటాలు చిరస్మరణీయం

● నేడు నీర్మాలలో కృష్ణమూర్తి వర్ధంతి



కాసం కృష్ణమూర్తి

దేవరుప్పుల : భూమి కోసం ..భుక్తి కోసం..బానిస బంధాల విముక్తి కోసం కొనసాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా కేంద్రంగా కాసం కృష్ణమూర్తి చేపట్టిన ప్రజాపోరాటాలు చిరస్మరణీయం. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం నీర్మాలకు చెందిన కాసం కృష్ణమూర్తి గ్రామాల్లో భూస్వాములు, దేశ్‌ముఖ్‌ల పెత్తందారి వ్యవస్థపై ఎదురుదిరిగారు. తన తుదిశ్వాస వరకూ సీపీఎం అనుబంధ ఉమ్మడి రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడిగా అనేక విరోచిత పోరాటాలు చేపట్టారు. కాసం వారసత్వాన్ని అందిపుచ్చుకునే క్రమంలో శుక్రవారం నీర్మాలలో ఆయన వర్ధంతి సభ నిర్వహించనున్నారు. ఈ సభను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఇంటి వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఫ్యూడల్, రాచరిక పాలన, కులవివక్షకు వ్యతిరేకంగా పోరాడాలని నిర్ణయించి దళాలుగా ఏర్పడి ఈ ప్రాంత భూస్వాములు, దేశ్‌ముఖ్‌లను తరిమిన మహావీరుడు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత కాసం కృష్ణమూర్తి అన్నారు. కార్యక్రమంలో నాయకులు పయ్యావుల భిక్షపతి, గడ్డం యాదగిరి, కున్సోత్ మాలు, రెడ్డిరాజుల నారాయణ, జాటోత్ శ్రీను నాయక్, గోడిశాల రాములు, కాసర్ల యాదిరెడ్డి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు .

ట్రైనీ సర్వేయర్లకు న్యాయం చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న ఎల్ఎస్ఎస్ అభ్యర్థులు

హన్మకొండ అర్బన్: ట్రైనీ లైసెన్స్‌డ్ సర్వేయర్ సిస్టమ్ (ఎల్ఎస్ఎస్)కు ఇటీవల నిర్వహించిన పరీక్షలో సమయానికి మించి ప్రశ్నాపత్రం ఉండడంతో తమకు అన్యాయం జరిగిందని ట్రైనీ ఎల్ఎస్ఎస్‌లు వాపోయారు. ఈ మేరకు తమకు న్యాయం చేయాలని కోరుతూ హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ థియరీ ప్రశ్నాపత్రంలో ఇంగ్లిష్, తెలుగులో విభిన్నంగా ప్రశ్నలు రావడం, ప్రశ్నాపత్రాల్లో టోపో డిటెయిల్స్‌లో జరిగిన తప్పుల కారణంగా థియరీ ప్రశ్నాపత్రంలో సమాధానాలు రాయడానికి సమయం సరిపోలేదని పేర్కొన్నారు. తాలిమ్ (తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ అండ్ మేనేజ్‌మెంట్) మెటీరియల్ ప్రకారం 100 శాతం థియరీ - ప్రాక్టికల్స్‌ను జిల్లా శిక్షణ కేంద్రంలో అధికారులు, అధ్యాపకులు నేర్పించారని, అయినప్పటికీ ప్రశ్నలు మెటీరియల్ నుంచి ఇవ్వకుండా అన్యాయం చేశారని వాపోయారు. ఈ క్రమంలో మళ్లీ పరీక్షలు నిర్వహించాలని, జవాబు పత్రాలలో పేజీలను పెంచాలని, ప్లాటింగ్‌లో ప్రింటింగ్ క్లారిటీగా ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు.

సీఎం దిష్టిబొమ్మ దహనానికి యత్నం



దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకుంటున్న పోలీసులు

కేయూ క్యాంపస్: రాష్ట్రంలో విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో సీఎం రేవంత్‌రెడ్డి విఫలమయ్యారని ఏబీఎస్ఎఫ్ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద సీఎం దిష్టిబొమ్మ దహనానికి గురువారం యత్నించారు. కేయూ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, సిబ్బంది అక్కడికి చేరుకుని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఏబీఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ మాట్లాడుతూ విద్యార్థులకు ఇప్పటి వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ నాయకులు విజయ్, నందు, విష్ణు, పీటర్, శ్రీకాంత్, పవన్, అరవింద్, నవీన్, తరుణ్, గణేశ్, వంశీ, గోవింద్, సమ్మయ్య, సూర్యసాయి తదితరులు పాల్గొన్నారు.